రాత్రి తవ్వకం.. పగలు రవాణా

యథేచ్ఛగా ఇసుక దోపిడీ
వాగులు, వంకలనూ వదలని అక్రమార్కులు


పెనుమూరు వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు


పెనుమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించిందే తడవుగా ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు.. ఎక్కడ పడితే అక్కడ ఇష్టారీతిన తోడేస్తున్నారు.. నదులు, వాగులు, వంకల్లో తమకు ఇష్టం వచ్చిన ప్రాంతాల్లో వాహనాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.. టిప్పర్లు, లారీల్లో ఇతర రాష్ట్రాలకు సైతం తరలిస్తున్నారు.. రోజు వందల సంఖ్యలో వాహనాల్లో అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు.. ఓవైపు అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోక తమ పని చేసుకుపోతున్నారు.

అంతా అక్రమమే.. ఎన్టీఆర్ జలాశయానికి నీరు అందించే భీమా నది పూతలపట్టు వైపు నుంచి ప్రవహిస్తుంది. ఈ నదిలో బండపల్లె సమీపంలో కొందరు రాత్రింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడ తరలించేందుకు అనుమతి లేదు. అయినప్పటికీ ఒక్కోసారి రాత్రివేళ యంత్రాలతో కుప్పగా చేర్చి పగలు ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో చిత్తూరు, పెనుమూరు, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రూ. 2500 నుంచి రూ.3 వేలు వరకు విక్రయిస్తున్నారు. పెనుమూరు మండలం పూనేపల్లె సమీపంలో నీవానది నుంచి సైతం వాహనాల్లో యథేచ్ఛగా తోడేస్తున్నారు. వాహనాల రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వాగులు, వంకల్లో సైతం తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు.

భారీ వాహనాల్లో తమిళనాడుకు..


పూనేపల్లె మార్గంలో నిలిపిన ఇసుక ట్రాక్టర్

జిల్లా నుంచి తమిళనాడుకు భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారు. అక్కడ మంచి గిరాకీ ఉండటాన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. భారీ లారీల్లో నింపి అధికారుల కళ్లుగప్పి పైభాగంలో ప్లాస్టిక్ పట్టలు కప్పేస్తున్నారు. ఇలా జీడీనెల్లూరు, పాలసముద్రం మండలాల మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇటీవల టిప్పర్లు పట్టుబడటం, ఓ భారీ వాహనం బోల్తా పడిన సంఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి.



కఠిన చర్యలు తీసుకుంటాం..

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు మండలాల స్థాయిలో కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలో తహసీల్దారు, ఎంపీడీవో, ఎస్సై సభ్యులు. ఆయా కమిటీలకు సమాచారం ఇచ్చి అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- చిన్నయ్య, ఆర్డీవో, చిత్తూరు

కల్పవృక్ష వాహనాయా.. సత్యప్రమాణాల దేవా


కల్పవృక్ష వాహన పల్లకీలో ఊరేగుతున్న వినాయకుడు




సర్వాలంకృతులైన ఉత్సవమూర్తి

కాణిపాకం, న్యూస్‌టుడే: ప్రత్యేకోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన బుధవారం ఉభయ దేవేరులతో కలిసి వరసిద్ధి వినాయక స్వామివారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించారు. భక్తులు స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకొని మంత్రముగ్ధులయ్యారు. ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.


క్షీర కలశాలను తెస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్, అధికారులు, సిబ్బంది


కొడిదపల్లె పొలాల్లో సంచరిస్తున్న చిరుత

పొలాల్లో చిరుత సంచారం

కల్లూరు: పులిచెర్ల మండలంలోని కొడిదపల్లె సమీపంలోని వ్యవసాయ పొలాల్లో బుధవారం సాయంత్రం చిరుత సంచరిస్తూ కనిపించింది. చిరుత కనిపించడంతో సమీపంలోని రైతులు గేదెమని బాలాజీ చరవాణిలో చిత్రీకరించారు. విషయాన్ని పీలేరు రైల్వేశాఖ అటవీశాఖ అధికారులకు చెప్పగా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తామన్నారని బాలాజీ చెప్పారు. విషయం తెలిసిన కొడిదపల్లె, కరవపల్లె, చింతలవారిపల్లె, 102ఘ. రామిరెడ్డిగారిపల్లె ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పింఛనులో ఏడాది పాటు ఐదు శాతం కోత

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీవెంకటేశ్వర్లుకి వచ్చే పింఛనులో ఏడాది కాలం పాటు ఐదు శాతం కోత విధిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు.

రైతుల కష్టాలకు కుంకీలతో చెక్!

- కర్ణాటక నుంచి జిల్లాకు ఐదు ఏనుగులు
- పలమనేరు కేంద్రంగా స్థావరం ఏర్పాటు



జిల్లా రైతాంగాన్ని ఏనుగుల సమస్య వేధిస్తోంది. ఒకవైపు పంటలు సర్వనాశనం చేస్తుండటంతోపాటు మనుషుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఆస్తి, ప్రాణనష్టం గణనీయంగా జరుగుతున్నా గత వైకాపా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. అటవీ శాఖ మంత్రి జిల్లాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆయన సైతం ఎటువంటి శ్రద్ధ చూపలేదు. తాజాగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కార్ సమస్య పరిష్కారానికి అడుగులు వేయడం మొదలుపెట్టింది. పొరుగునే ఉన్న కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తీసుకువచ్చి జిల్లాలో స్వైరవిహారం చేస్తున్న గజరాజులు, మదపుటేనుగులను కట్టడి చేసేందుకు కదిలింది.

ఏనుగుల దాడులతో నష్టాలు (దశాబ్ద కాలంలో)

మరణించిన వ్యక్తులు (మంది)	15
క్షతగాత్రులు (మంది)	20
పంటనష్టం: వేల ఎకరాలు	5
మృతి చెందిన ఆవులు	50

766.13 చ.కి.మీ.	జిల్లాలోని ఏనుగుల అభయారణ్య విస్తీర్ణం
357.56 చ.కి.మీ.	ఇందులో కౌండిన్య విస్తీర్ణం
90 కిపైగా	ఈ ప్రాంతంలోని ఏనుగుల సంఖ్య

జిల్లాలో ఏనుగుల కారణంగా ఐదు వేల ఎకరాల్లో పంట దెబ్బతిందని అధికారుల అంచనా మాత్రమే. వాస్తవానికి దీని కన్నా 10 రెట్లు అధికంగా నష్టం వాటిల్లింది. దీన్ని అరికట్టాలనే ఉద్దేశంతోనే కుంకీ ఏనుగులను తీసుకువస్తున్నారు.

20 ఏళ్ల కిందటే: జిల్లాలో ఏనుగుల తాకిడి అధికంగా ఉన్నందున 20 ఏళ్ల క్రితం జయంత్, వినాయక్ అనే ఏనుగులను తెచ్చారు. మదపుటేనుగులు, సమూహాలను విడదీసి అడవికి చేర్చాలనే దానిపై వాటికి శిక్షణ ఇచ్చి కుంకీలుగా తీర్చిదిద్దారు. రామకుప్పం మండలంలోని నరియాల ఏనుగుల సంరక్షణ కేంద్రంలో వీటిని ఉంచారు. ఇవి పలు ఆపరేషన్లలో పాల్గొన్నాయి. గతేడాది ఆగస్టులో గుడిపాల మండలం 190.రామాపురంలో దంపతులైన సెల్వి, వెంకటేష్‌పై మదపుటేనుగు దాడి చేసి ఇద్దరిని చంపేసింది. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ గజ' పేరుతో అన్ని విధాలా ఆరితేరిన జయంత్, వినాయక్‌ను రంగంలోకి దింపారు. చివరకు గజరాజును బంధించి తిరుపతి జంతు ప్రదర్శనశాలకు తరలించారు.

వృద్ధాప్యం పెరగడంతో.. ప్రస్తుతం జయంత్ వయసు 55, వినాయక్ వయసు 59 ఏళ్లు. ఇవి వృద్ధాప్యంలో ఉన్నందున పెద్దగా ఆపరేషన్లలో పాల్గొనే పరిస్థితి లేదు. అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను అటవీ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వెళ్లడంతో గతనెల 8న ఆయన కర్ణాటక వెళ్లి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో మాట్లాడారు. కుంకీ ఏనుగులు ఇవ్వాలని కోరగా ఆయన అంగీకరించారు. ఈనెల 27న ఒప్పందం జరగనుంది.

ఆరు నెలలు.. ఏడాదిలోపు రాక: కర్ణాటక నుంచి జిల్లాకు ఐదు కుంకీలు రానున్నాయి. ఆరు నెలలు- ఏడాదిలోపు ఇవి చేరుకుంటాయి. వీటిని కౌండిన్య అభయారణ్యం లేదా ముసలిమడుగులో ఉంచనున్నారు. మొత్తానికి పలమనేరు కేంద్రంగానే స్థావరం ఏర్పాటు కానుంది. ఇక్కడి నుంచి జిల్లాలో ఎక్కడికైనా సులభంగా ఏనుగులను తరలించవచ్చు. సైతం వీటిని ఆధారంగా చేసుకుని పర్యాటకంగానూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చన్నది ప్రణాళిక.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా బుధవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు ఆరు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. మంగళవారం శ్రీవారిని 67,616 మంది దర్శించుకున్నారు. రూ.3.89 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

వీఐపీ బ్రేక్ టికెట్ల జారీలో అంతరాయం: తితిదే వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లకు సంబంధించిన ఎస్ఎంఎస్ జారీకి బుధవారం రాత్రి కొద్దిసేపు అంతరాయం కలిగింది. అదనపు ఈవో కార్యాలయం చేరుకోవడంతో వారికి మాన్యువల్‌గా టికెట్ల సమాచారాన్ని అందించారు. కొంతసేపటికి ఎస్ఎంఎస్‌ల జారీ పునఃప్రారంభమైంది.

తిరుమలకు నేతల వరుస

తిరుమల: కల్తీ నెయ్యి వివాదాల నేపథ్యంలో పలు పార్టీల నేతలు తిరుమల రానున్నారు. ఈ నెల 28న వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు కాలినడకన రానున్నట్లు సమాచారం. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీకి ప్రాయశ్చితంగా దీక్ష చేపట్టిన రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈనెల 1, 2న తిరుమలకు చేరుకుని దీక్షను విరమించనున్నారు. ● అక్టోబర్ 4న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల మొదటిరోజు సీఎం చంద్రబాబునాయుడు సతీసమేతంగా తిరుమల విచ్చేసి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

అయోమయంలో ఆగ్రోస్

☛ అన్నదాతకు దూరమైన సేవలు


వృథాగా నూతన సాగు పరికరాలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఆగ్రోస్ సంస్థను గాలికొదిలేసింది.. ఏపీ ఆగ్రోస్(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) కార్యకలాపాలు అయోమయంగా మారాయి.. సంస్థ సేవలు అన్నదాతకు దూరమయ్యాయి.. సాగులో కర్షకులు చేదోడువాదోడుగా ఉండాల్సిన ఆగ్రోస్ కనుమరుగైంది. కూటమి ప్రభుత్వం ఆగ్రోస్‌కు పూర్వవైభవం తెచ్చి సేవలు విస్తరిస్తుందనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటైన ఆగ్రోస్ సంస్థ ఒకప్పుడు రైతుల సంక్షేమానికి విశేష సేవలందించి మంచి ఆదరణ పొందింది. వ్యవసాయ బంజరు, బీడు భూములను చదును చేయడం, పొలాల చుట్టూ కందకాల తవ్వకం, చెరువుల్లోని సారవంతమైన మట్టిని పొలాలకు తరలించడం, పెద్దపెద్ద చెట్లు, గుట్టలు తొలగించడం, సేద్యపు కుంటలు తవ్వకానికి యంత్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. ప్రస్తుతం పెద్ద యంత్రాల నిర్వహణ లేక అవి కాస్తా తూతూమంత్రంగా నడుస్తున్నాయి.

కంప్యూటర్ ఆపరేటరే దిక్కు..

ఈ కార్యాలయం మొత్తానికి ఒప్పంద కంప్యూటర్ ఆపరేటరే దిక్కు. కార్యాలయ నిర్వహణ, పర్యవేక్షణను ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. భూములను చదును చేసే పెద్ద యంత్రాల నిర్వహణ, సమకూరే ఆదాయం, ఖర్చులు, అధికారులు, సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. సేవలను విస్తృత పరిచి సాగు యంత్రాలను రైతులకు అందుబాటులో తీసుకువచ్చే ప్రణాళికలే లేవు. కనీసం కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలకు సమాధానం చెప్పే నాథుడే కరవయ్యాడు.

పాడైపోతున్న పరికరాలు..

ట్రాక్టరు, వరి, వేరుసెనగ విత్తన నాట్లు యంత్రాలు, రొటోవేటరు, మడకలు, వేరుసెనగ నూర్పిడి యంత్రం, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రం సాగుకు ఉపయోగపడే పలు రకాల అధునాతన యంత్రాలు ఈ కార్యాలయంలోనే ఐదేళ్లుగా వినియోగించక పాడైపోతున్నాయి.

ఇన్‌ఛార్జి అధికారెక్కడా..?

ఆగ్రోస్ ఆర్ఎంగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో రాష్ట్ర ఆగ్రోస్ కార్యాలయంలో జీఎం రాజమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నెల రోజులు కావస్తున్నా.. ఈ కార్యాలయం వైపు ఆయన కన్నెత్తి చూడలేదు.

ఎట్టకేలకు విభజించారు!

- చిత్తూరులో విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం
- అధికారులు, సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు
- అక్టోబరు 2న ప్రారంభానికి సన్నాహాలు



చిత్తూరు(మిట్టూరు), తిరుపతి నగరం, న్యూస్‌టుడే: ప్రజలకు విద్యుత్తు సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.. సమస్యలు సత్వర పరిష్కారం కానున్నాయి.. కొత్త జిల్లాల వారీగా ఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.. గత ప్రభుత్వంలో కొత్త జిల్లాలు ఏర్పడినా సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు కాలేదు. తిరుపతిలోని విద్యుత్తు శాఖ కార్యాలయం నుంచే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కార్యకలాపాలు నిర్వహించేవారు.. అన్ని విద్యుత్తు సంస్థల డిస్కంల పరిధిలో జిల్లాల వారీగా నూతన సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.. ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్కిల్ కార్యాలయం మూడు విభాగాలుగా విడిపోనుంది. చిత్తూరుతో పాటు అన్నమయ్య జిల్లా రాయచోటిలోనూ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు కానుంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా కేంద్రం చిత్తూరు అయినప్పటికీ విద్యుత్తు శాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో కొనసాగేది. కొన్నేళ్లుగా చిత్తూరు ప్రజలు విద్యుత్తు సేవలు, సమస్యల పరిష్కారానికి తిరుపతికి వెళ్లాల్సివచ్చేది. ఈ సమస్యకు కూటమి ప్రభుత్వం చరమగీతం పాడింది. ఇన్నాళ్లు ఏ ఆమోదం కావాలన్నా.. కీలకమైన సేవలకు తిరుపతిలోని సర్కిల్ కార్యాలయం నుంచి పొందాల్సి వచ్చేది. ఉద్యోగుల, సర్వీసు వ్యవహారాలూ అక్కడి నుంచే నిర్వహించేవారు. ఇకపై జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఏర్పాటయ్యే నూతన సర్కిల్ కార్యాలయంలోనే నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అక్టోబరు రెండో తేదీ నుంచి ఇక్కడ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా కసరత్తు వేగవంతం చేశారు. సర్కిల్ కార్యాలయానికి పర్యవేక్షక ఇంజినీరు, సీనియర్ అకౌంట్స్ అధికారి పోస్టులు రానున్నాయి.

సర్కిల్ పరిధిలో డివిజన్లు..

కొత్త సర్కిల్ పరిధిలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పుంగనూరు, పుత్తూరు డివిజన్లు ఉంటాయి. ప్రస్తుతం పుత్తూరు డివిజన్ (కొన్ని మండలాలు చిత్తూరు, తిరుపతి జిల్లాలో ఉన్నాయి). చిత్తూరులో అద్దె భవనంలో నూతన సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ) పరిపాలనా వ్యవహారాలు సాగించనున్నారు.

నగరిలో రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు
పీఎంశ్రీకి ఎంపిక

నగరి, న్యూస్‌టుడే: మండలంలో రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయని మండల నోడల్ అధికారి నమఃశివాయ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం.కొత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికయ్యాయని చెప్పారు. ఒక్కో పాఠశాలకు క్రీడా మైదానం, సైన్సు ల్యాబ్‌ల అభివృద్ధికి రూ.20 లక్షలు నిధులు విడుదలవుతాయన్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలలను ఏఈ నాగభూషణంతో కలిసి సందర్శించామన్నారు. ప్రధానోపాధ్యాయులు గీతాకుమారి, పార్వతీదేవి పాల్గొన్నట్లు తెలిపారు.

దస్త్రాల నిర్వహణలో పద్ధతిగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగులకు పని ప్రదేశం.. ఆలయం వంటిది. పని ప్రదేశం అపరిశుభ్రంగా.. ప్రభుత్వ దస్త్రాలు చిందరవందరగా ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ సుమిత్ కుమార్.. కార్యాలయాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ నెల 24న కలెక్టరేట్‌లోని కార్యాలయాల్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెక్షన్లలో దస్త్రాలను సక్రమంగా నిర్వహించకపోవడం, పని ప్రదేశంతో పాటు సిబ్బంది డెస్కులు అపరిశుభ్రంగా ఉండటం, అలమారాల్లో దస్త్రాలు క్రమపద్ధతిలో లేకపోవడాన్ని గుర్తించారు. లోపాల్ని వెంటనే సవరించుకోవాలని, అన్నింటిని పద్ధతిగా ఉంచాలని.. కలెక్టరేట్‌లోని అధికారులు, సెక్షన్ల సూపరింటెండెంట్లు, ఉద్యోగులకు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. 'ముఖ్యంగా ప్రతి దస్త్రాన్ని పక్కాగా భద్రపరచాలని, ర్యాక్స్‌ను శుభ్రంగా ఉంచాలని, నిరుపయోగ వస్తువుల్ని తొలగించాలని, అవసరమైన చోట లైటింగ్ ఏర్పాటు చేయాలని, దస్త్రాలను సంవత్సరాల వారీగా అమర్చాలని' అందులో స్పష్టంచేశారు. అక్టోబరు 5న మళ్లీ తనిఖీ చేస్తానని, ఈలోగా అన్ని పనుల్ని పూర్తిచేసుకోవాలన్నారు. పొరపాట్లు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


కలెక్టరేట్‌లో తనిఖీ చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్(పాత చిత్రం)

తీగల కుంభకోణంపై దర్యాప్తు

ఈనాడు కథనానికి స్పందన

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు విద్యుత్తు సబ్ డివిజన్ నియంత్రికల మరమ్మతు కేంద్రంలో రాగి, అల్యూమినియం తీగల కుంభకోణంపై దర్యాప్తునకు ప్రత్యేక బృందం వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పీలేరు, పలమనేరు కేంద్రాల్లో మరమ్మతు కోసం తెచ్చిన నియంత్రికల నుంచి రాగి, అల్యూమినియం తీగలను విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఫిర్యాదులు పరిశీలనలో ఉన్నాయి. ఇటీవల 'ఈనాడు'లో 'కాలిన కమ్మీల్లో రూ.కోట్లు దండుకున్నారు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కుంభకోణంలో సూర్యతేజ, కమల్ సబ్ ఇంజినీర్లను, పలమనేరులో ఒకరిని, పీలేరులో మరొకరిని తాత్కాలికంగా తొలగించడంతో దర్యాప్తు వేగవంతమవుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు రూ.3.5 కోట్ల విలువైన తీగలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ప్రత్యేక బృందం సమగ్రంగా దర్యాప్తు చేస్తోందని ఉమ్మడి జిల్లాల సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేంద్రనాయుడు తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో ప్రారంభమైన బదిలీలు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖలో బుధవారం బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్ఈబీ విభాగంలో ఉన్న వారిని ఎక్సైజ్ శాఖకు కేటాయించడమేకాక వారిని బదిలీ చేసి, పోస్టింగ్‌లు కేటాయించారు. మొదటగా డీసీ, ఏసీ, ఈఎస్ అధికారులకు బదిలీలు జరిగాయి. గురు, శుక్రవారాల్లో ఏఈఎస్, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీలు జరగనున్నాయి.

▶ అనంతపురం ఎస్ఈబీలో డీసీగా ఉన్న టి.విజయశేఖర్‌ను ఎక్సైజ్‌శాఖకు కేటాయించి చిత్తూరు డీసీగా నియమించారు. తిరుపతి డిస్టిలరీస్‌లో సహాయ కమిషనరు(ఏసీ)గా ఉన్న కె.శ్రీనివాసాచారిని చిత్తూరు ఏసీగా, చిత్తూరు విజిలెన్సులో ఉన్న పి.రామచంద్రరావును హెడ్‌కార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. తిరుపతి ఎస్ఈబీ ఈఎస్‌గా ఉన్న ఎస్.శ్రీనివాస్‌కు చిత్తూరు ఈఎస్‌గా పోస్టింగ్ ఇచ్చారు. చిత్తూరు ఎస్ఈబీ ఈఎస్‌గా ఉన్న వి.శ్రీధర్‌రావును, చిత్తూరు డీపీఈవోగా ఉన్న షేక్ ఆయేషాబేగంను ఏపీఎస్‌బీసీఎల్ డీఎంలుగా కేటాయించారు.

అంతర జిల్లాల బదిలీపై ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో ఉద్యోగుల అంతర జిల్లాల బదిలీపై కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్ఐ కేడర్‌లో ఇద్దరు, గ్రేడ్-1 వీఆర్‌వోలు నలుగురు, గ్రేడ్-2 కేడర్‌లో వీఆర్‌వోలు ఆరుగుర్ని బదిలీచేశారు.

బరితెగించారు!

పాఠశాల స్థలం ఆక్రమించేందుకు ప్రహరీ కూల్చివేత


గూడూరుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ కూల్చివేత

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు అలవరిచే పాఠశాల స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు అక్రమార్కులు ఏకంగా ప్రహరీని కూల్చిన ఘటన పుంగనూరు మండలం గూడూరుపల్లెలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఏనుగుల వెంకటన్న భార్య సాకమ్మ 1966లో 40 సెంట్ల భూమి దానం చేయడంతో 1967లో ప్రాథమిక పాఠశాల నిర్మించారు. 1999లో జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. వైకాపా ప్రభుత్వంలో పాఠశాలకు చెందిన 19 సెంట్ల స్థలాన్ని గోదాము దారి కోసం ఆక్రమించారు. ఈ విషయమై గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త గోపాల్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో సర్వేకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు పాఠశాలకు హద్దులు సూచించారు. ఈ నెల 22న రూ.2 లక్షలతో ప్రహరీ నిర్మించారు. 24న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ప్రధానోపాధ్యాయుడు మహేష్ నారాయణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దారు రామును వివరణ కోరగా.. ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాణిపాకం ఆలయ గిడ్డంగిలో నమూనాల సేకరణ



నమూనాలు సేకరిస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయానికి ప్రసాదాలు తయారుచేసేందుకు ఉపయోగించే నెయ్యి, ఇతర వస్తువుల నమూనాలను జిల్లా ఆహార భద్రత సంస్థ అదనపు కంట్రోలర్ సప్నా శ్రీనివాస్ ఆలయ గిడ్డంగి నుంచి బుధవారం సేకరించారు. 'ఈనాడు'లో బుధవారం 'వినాయకా.. ఇక్కడెంత సురక్షితం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఆలయంలో భక్తులకు అందిస్తున్న లడ్డూ, వడలతో పాటు వాటికి ఉపయోగిస్తున్న నెయ్యి నమూనాలను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. 14 రోజుల తర్వాత నివేదిక వస్తుందని చెప్పారు. ఆహార భద్రత అధికారి ఎం.నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సంఘం నేత మృతి



మల్లికార్జునసెట్టి (పాత చిత్రం)

పెనుమూరు, న్యూస్‌టుడే: ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పద్మశాలి కుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జునసెట్టి (65) బుధవారం మరణించారు. తన భార్యకు కంటి శస్త్రచికిత్స చేయించేందుకు తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. భార్యను గదిలో విడిచిపెట్టి తాను మూత్ర విసర్జనకు మరుగుదొడ్డిలోకి వెళ్లి కాలు జారి పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆయన మండల చేనేత సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఆయన మృతి పట్ల రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి షణ్ముగవర్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బాలాజీ, పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మెరుగులు

■ నాడు నిర్లక్ష్యం.. నేడు ప్రాధాన్యం ■ సౌకర్యాల కల్పనపై దృష్టి



పుంగనూరు, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు రానున్నాయి. గత వైకాపా పాలనలో ఈ కేంద్రాల్లో కనీస వసతులు కరవయ్యాయి. చిన్నారులకు అసౌకర్యాల మధ్యనే కేంద్రాల్లో కొనసాగారు. పలు కేంద్రాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వసతులు లేక నానా అవస్థలు పడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంగన్‌వాడీ కేంద్రాల రూపు మారుతోంది. చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించడానికి తెదేపా ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత తాగునీరు, మరుగుదొడ్లకు ప్రాధాన్యతనిచ్చింది. మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 36వేలు, తాగునీటి కల్పనకు రూ. 17వేలు మంజూరు చేసింది.

రూ.2.20 కోట్లు మంజూరు..

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 380 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 1,36,80,000లు, తాగునీటి వసతులకు రూ. 84,15,000లు మంజూరయ్యాయి. ఈ నిధులతో త్వరలో పనులు చేపట్టడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టేలా బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, చిత్తూరు రూరల్, గంగాధర నెల్లూరు, ఐరాల, కార్వేటినగరం, కుప్పం, నగరి, పలమనేరు, పులిచర్ల, పుంగనూరు, శాంతిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మంజూరైన మరుగుదొడ్ల సంఖ్య, నిధులు, తాగునీటి పనులు, నిధుల మంజూరు ఇలా ఉన్నాయి.

ఐసీడీఎస్ ప్రాజెక్టు	మరుగుదొడ్ల సంఖ్య	నిధులు రూ.లక్షల్లో	తాగునీటి పనులు	నిధులు రూ.లక్షల్లో
బైరెడ్డిపల్లె	50	18.00	36	6.12
బంగారుపాళ్యం	24	8.64	31	5.27
చిత్తూరు గ్రామీణ	19	6.84	20	3.40
జీడీ నెల్లూరు	15	5.40	27	4.59
ఐరాల	26	9.36	36	6.12
కార్వేటినగరం	14	5.04	42	7.14
కుప్పం	57	20.52	71	12.07
నగరి	8	2.88	37	6.29
పలమనేరు	39	14.04	44	7.48
పులిచర్ల	44	15.84	21	3.57
పుంగనూరు	39	14.04	60	10.20
శాంతిపురం	45	16.20	70	11.90

త్వరలో పనులు ప్రారంభిస్తాం

సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు, తాగునీటి వసతుల కల్పన పనులు త్వరలో ప్రారంభిస్తాం. ప్రభుత్వం నిధుల కేటాయింపుతో పాటు పనుల బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించింది. ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూస్తాం.

– నాగశైలజ, పీడీ, ఐసీడీఎస్, చిత్తూరు



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కు పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి తదితరులు

అన్నిరంగాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి

సోమల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్రంలో ఆర్థికలోటు ఉందని.. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని పుంగనూరు నియోజకవర్గ బాధ్యుడు చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు చల్లా రామచంద్రారెడ్డికి స్వాగతం పలికి బస్టాండు నుంచి సభ ప్రాంగణం వరకు భారీ ర్యాలీగా వచ్చారు. మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 9.39కోట్ల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ బాధ్యుడు మదన్‌మోహన్‌బాబు, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు భూషణ్‌యాదవ్, ఉమాపతినాయుడు, హరిప్రసాద్, రమేష్‌నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో జట్టు ఎంపిక

జే.పంగులూరు: ఝార్ఖండ్ రాష్ట్రం షిండీగా పట్టణంలో ఈ నెల 28 నుంచి అక్టోబరు మూడో తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల జట్టును బాపట్ల జిల్లా జే.పంగులూరు ఎంఎస్ఆర్.అండ్ బీఎన్ఎం.జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. అండర్-14 సబ్ జూనియర్స్ ఖోఖో క్రీడాకారుల జట్టులో ఎస్.బదరీనాథ్(చిత్తూరు) ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో 34మంది ఎంపీడీవోల బదిలీ

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలను బదిలీ చేస్తూ జడ్పీ పూర్వ సీఈవోగా గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. 65 మండలాలకు గాను 18 మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీగా ఉండగా ఇన్‌ఛార్జుల పాలన నడుస్తోంది. ఇప్పుడు 34 మంది ఎంపీడీవోలను బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో పనిచేసే ఎంపీడీవోలు బదిలీకి దరఖాస్తు చేసుకోకపోవడంతో వారు అక్కడే కొనసాగనున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ ప్రాంతం
ఇందిరమ్మ	పుత్తూరు	రామచంద్రాపురం
అరుణ	నింద్ర	యర్రావారిపాళ్యం
ధనలక్ష్మి	పూతలపట్టు	ఐరాల
శివరాజు	యాదమరి	గుడిపాల
గంగయ్య	కలికిరి	కురబలకోట
తాజ్‌మసూర్	గుడుపల్లె	మదనపల్లె
శ్రీనివాసులు	రామచంద్రాపురం	చిత్తూరు
మహ్మద్‌రఫీ	వి.కోట	పిచ్చాటూరు
అబ్దుల్‌రహీం	పెద్దపంజాణి	కలకడ
చంద్రమౌళి	విజయపురం	కార్వేటినగరం
శేషగిరిరావు	నిమ్మనపల్లె	వడమాలపేట
భానుమూర్తిరావు	వడమాలపేట	కలికిరి
సురేంద్రనాథ్	తంబళ్లపల్లె	తొట్టంబేడు
సురేష్‌బాబు	తొట్టంబేడు	గంగవరం
సుధాకర్	చౌడేపల్లె	కేవీపల్లె
బాలాజీ	పీటీఎం	పెద్దపంజాణి
అబ్దుల్‌కలాంఆజాద్	తవణంపల్లె	సోమల
అమరనాథ్	యర్రావారిపాళ్యం	వెదురుకుప్పం
నాగరాజు	ఐరాల	పూతలపట్టు
హరినారాయణ	కురబలకోట	ములకలచెరువు
భానుప్రసాద్	మదనపల్లె	రామసముద్రం
పరమేశ్వరరెడ్డి	కలకడ	నిమ్మనపల్లె
మధుసూదనరెడ్డి	గంగవరం	రొంపిచెర్ల
ప్రేమ్‌రాజ్‌కుమార్	వెదురుకుప్పం	శాంతిపురం
లీలామాధవి	నగరి	గుడుపల్లె
రామచంద్ర	కేవీబీపురం	తిరుపతి గ్రామీణ
రమేష్‌బాబు	తిరుపతి గ్రామీణ	రేణిగుంట
గిడ్డయ్య	ఏర్పేడు	చిన్నగొట్టిగల్లు
ఉపేంద్రరెడ్డి	పీలేరు	తంబళ్లపల్లె
శివశంకర్	బంగారుపాళ్యం	పీలేరు
విష్ణుచిరంజీవి	రేణిగుంట	పీటీఎం
బాలాజీనాయక్	చంద్రగిరి	నాగలాపురం
సౌభాగ్యం	వైఎస్సార్ జిల్లా	ఏర్పేడు
లక్ష్మీకాంత్	విజయనగరం	రామకుప్పం



తిరుమల డీఈఈ (ఆపరేషన్)గా బదిలీ అయిన వి.సతీష్‌ను అభినందిస్తున్న సిబ్బంది


ఎస్పీడీసీఎల్‌లో భారీగా బదిలీలు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఎస్పీడీసీఎల్, తిరుపతి పరిధిలో భారీగా బదిలీలు జరిగాయి. బుధవారం సీఎండీ కె.సంతోష్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలో పరిధిలోని ఈఈలు 31 మంది, డీఈఈలు 64 మందికి స్థానచలనం కలిగింది. ఏఈలు 28, జేఈఈలు 2, ఏవోలు, ఏసీసీలు 2, ఏఏవోలు, ఏసీసీలు 19, జూనియర్ సహాయకులు 2, ఎస్‌వోఎస్ 1, జేఎల్ఎంలు 2, పీవో 1 మొత్తం 152 మందిని బదిలీ చేశారు.

రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లు..

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న జూనియర్ తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు, ఒక టైపిస్ట్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

విద్యుత్తు శాఖ గ్రీవెన్స్‌కు 13 వినతులు



చిత్తూరు అర్బన్ డివిజన్‌లో వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలపై ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ పరిధిలో ఎనిమిది డివిజన్లు, 27 సబ్-డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 13 సమస్యలపై వినతులు వచ్చాయని ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. విద్యుత్తు స్తంభాలు, లైన్ల మార్పు, అధిక విద్యుత్తు బిల్లింగ్, మీటర్ల మార్పు తదితర సమస్యలు ప్రస్తావించారన్నారు. ఏడు ఆర్థికేతర సమస్యలు వెంటనే పరిష్కరించామని, ఆర్థికపరమైన ఆరు సమస్యల పరిష్కారానికి నివేదిక సమర్పించాలని ఇంజినీర్లను ఆదేశించామన్నారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో నాలుగు వినతులు అందాయని, వీటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	124
రిటైల్	146
లేయర్	115
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	242
లేయర్ మాంసం	195

1,142 సీసీరోడ్ల పనుల్ని పూర్తిచేయాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థికంలో రూ. 56 కోట్లతో మంజూరైన 1,142 సీసీరోడ్ల పనుల్ని అక్టోబరు 10లోగా పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆదేశించారు. బుధవారం జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా పనులు ప్రారంభించని ఏజెన్సీలను గుర్తించి, ఆ పనుల్ని రద్దుచేసి మిగిలిన మండలాలకు కేటాయించాలన్నారు. ఇసుకకు ఎక్కడా సమస్య లేదని, తహసీల్దార్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. గతంలో ఎంపీ ల్యాడ్స్ కింద మంజూరైన పనుల్ని త్వరగా పూర్తిచేయాలని, ప్రస్తుతం రూ. 2 కోట్లతో మంజూరైన పనుల్ని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. శిక్షణ కలెక్టర్ హిమవంశీ, ఎస్ఈ శంకరనారాయణ, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

30 మంది ఆర్ఐ/సీనియర్ అసిస్టెంట్ల బదిలీ

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్/సీనియర్ అసిస్టెంట్ కేడర్‌లో పనిచేస్తున్న 30 మందికి బదిలీల్లో భాగంగా పోస్టింగుల్ని కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఐరాల, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రోహిత్, రూప ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం కోమల, వ్యాయమ ఉపాధ్యాయుడు దేవా బుధవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర జిల్లాల పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచారని, అక్టోబరు 6 నుంచి కర్నూలులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వీరిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, కార్యదర్శి రమేష్, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ మహబూబ్‌బాష, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్లోరియా సేవలు మరువలేనివి



బదిలీపై వెళ్లిన జడ్పీ సీఈవో గ్లోరియాను సత్కరిస్తున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లాకు జడ్పీ సీఈవోగా గ్లోరియా చేసిన సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. సీఈవోగా పనిచేస్తూ మాతృశాఖ రెవెన్యూకు బదిలీపై వెళ్లిన గ్లోరియాను స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్మన్ అధ్యక్షతన బుధవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆమె క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చారని, ఉద్యోగుల సంక్షేమం విషయంలో ఎంతో బాధ్యతగా వ్యవహరించి అందరి మన్ననలు పొందారన్నారు. నూతన సీఈవో రవికుమార్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకాశం జిల్లా నుంచి సీఈవోగా ఇక్కడికి వచ్చి ఏడు నెలలు పనిచేసి అందరిచే మంచిపేరు పొందడం గ్లోరియాకే చెందిందన్నారు. గ్లోరియా మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడికి వచ్చినప్పటినుంచి జడ్పీ పరిధిలోని అధికారులు, సిబ్బంది సమస్యలు 95 శాతం పరిష్కరించడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించానని, ఆ సమయంలో ఉద్యోగులు ఎంతో ఆనందించారన్నారు. అనంతరం ఆమెను ఛైర్మన్, వైస్ ఛైర్‌పర్సన్ రమ్య, నూతన సీఈవో తదితరులు ఘనంగా సత్కరించారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ నాయకులు చెంచురత్నం పాల్గొన్నారు.

99.94 శాతం విద్యార్థులకు ఆల్బెండోజల్ మాత్రలు

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 99.94 శాతం మంది విద్యార్థులకు ఆల్బెండోజల్ మాత్రలు మింగించామని డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి బుధవారం తెలిపారు. ఈ నెల 17న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి 96.04 శాతం పూర్తి చేయగా, బుధవారం మాప్ అప్ ప్రోగ్రాంలో భాగంగా 99.94 శాతం లక్ష్యం సాధించామని పేర్కొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

సూపర్ సిక్స్ హామీల అమలెప్పుడు?

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులు గడిచినా.. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం శోచనీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆరోపించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఎన్నికల హామీల్ని అమలు చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం థాలీ బజావో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఒక్క సంక్షేమమూ ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. హామీల అమలు కోసం ప్రజల తరఫున తాము గళాన్ని వినిపిస్తున్నామని స్పష్టం చేశారు. లేనిపోని రాద్ధాంతాలతో పాలన సాగదీస్తున్నారని, ఇప్పటికైనా హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. నాయకులు టికారాం, పరదేశి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో ఐపీ పెట్టిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి

పుత్తూరు, న్యూస్‌టుడే: తొరూరు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ఆర్టీసీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశాడు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్నాడు. ఆయన స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ. 20.45 లక్షలకు ఐపీ దాఖలు చేశాడు. తాను తిరుత్తణిలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ వ్యాపారం కొవిడ్ వల్ల నష్టపోయానని, కొత్తగా ప్రారంభించిన చీటీల వ్యాపారంలో కూడా నష్టం వచ్చిందని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. వస్త్ర వ్యాపారం వల్ల తాను రూ. 20.45లక్షలు అప్పులు చేశానన్నారు. వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ఐపీ దాఖలు చేసినట్లు పేర్కొన్నాడు. అయితే అతడు పథకం ప్రకారం ఉన్న ఆస్తులు విక్రయించి సొమ్ము చేసుకుని ఐపీ దాఖలు చేశాడని బాధితులు వాపోతున్నారు.

ప్రయాణమే అసలు పరీక్ష

◆ టెట్ కేంద్రాలు వందల కి.మీ దూరం ◆ ఆందోళనలో అభ్యర్థులు

గూడూరు, కోట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాసే అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. వారు ఎంపిక చేసుకున్న ఆప్షన్లకు కాకుండా ఇతర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించడంతో ప్రయాణం పెద్ద సమస్యగా మారుతోంది. టెట్ పాసైన వారు మాత్రమే డీఎస్సీ పరీక్ష రాయడానికి అర్హులు. కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 16 వేల పోస్టుల భర్తీకి ప్రకటన చేసింది. ఈ పరీక్షలు రాసేందుకు వచ్చే నెల 3 నుంచి 21 వరకు టెట్ నిర్వహణ ఏర్పాట్లు పాఠశాల విద్యాశాఖ చేపట్టింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన అర్హత పరీక్ష టెట్ నిర్వహణ చేపడుతోంది. పెద్దసంఖ్యలో అభ్యర్థులు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. పరీక్షల కేంద్రాలు పట్టణాలకు దూరంగా ఉండటం.. అభ్యర్థులకు కొన్నిచోట్ల పరీక్షల కేంద్రాలు 100-150 కి.మీ పైగా ఉండటంతో అవస్థలు తప్పవని వాపోతున్నారు.

టెట్ నోటిఫికేషన్	జులై 2
పరీక్షల షెడ్యూల్	అక్టోబర్ 3-21
ఉదయం	9.30-12.00
మధ్యాహ్నం	2.30-5.00
ఫలితాలు	నవంబర్ 2

మూడు ఆప్షన్ల ఆందోళన

టెట్ రాసే విద్యార్థులు మూడు జిల్లాలకు ఆప్షన్లు ఇచ్చారు. ఇలా కొందరు రెండు పరీక్షలు రాయాల్సి ఉంది. ఉదయం, మధ్యాహ్నం సమయంలో వేర్వేరు చోట్ల పరీక్షలు రాయాల్సి. ఇలాంటి వారు వెళ్లి రావడం చాలాకష్టం. పట్టణ శివార్లలో ఉండే కాలేజీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెతుక్కొంటూ వెళ్లడానికి తప్పవని ఆవేదన చెందుతున్నారు.

నెల్లూరు జిల్లా వ్యక్తి చిత్తూరులో పరీక్ష

టెట్ కోసం నెల్లూరు జిల్లాకు చెందిన ఓ మహిళ చిత్తూరు జిల్లాలో పరీక్ష రాయాల్సి ఉంది. ఆమె రెండు జిల్లాలు దాటి మూడో జిల్లాలో 200 కి.మీ వెళ్లి పరీక్షలు రాయాల్సి.

140 కి.మీ ప్రయాణం చేయాలి



మాది నాయుడుపేట మండలం మేనకూరు.. కాగా ఇక్కడి నుంచి 140 కి.మీ ప్రయాణం చేయాలి. నాయుడుపేట నుంచి నెల్లూరు అక్కడి నుంచి కావలి విట్స్‌లో పరీక్షలకు హాజరు కావాలి. ఉదయం వెళ్లడానికి వీలు లేదు. ఒక్క రోజు ముందే హాజరు కావాలంటే ఖర్చుల భారం తడిసి మోపెడవుతుంది.

– గురుప్రసూన, ఎజ్జీటీ, నాయుడుపేట

మూడు బస్సులు మారాలి



మాది తాళ్వాయపాడు. ఇక్కడి నుంచి ఆటో నాయుడుపేటకు.. అక్కడి నుంచి బస్సులో నెల్లూరు వరకు.. అక్కడి నుంచి కావలి వెళ్లాలి. ఇలా మూడు బస్సులు మారి పరీక్షకు రాయాలి. పరీక్షకు ముందు రోజే చేరుకోవాల్సి ఉంది. భర్తతో పాటు వెళ్లి రావడానికి రూ. 2 వేలు వరకు ఖర్చవుతోంది.

– ఒబ్బు లావణ్య, తాళ్వాయపాడు, పెళ్లకూరు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

అభ్యర్థుల నుంచి ఫిర్యాదులొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - శేఖర్, డీఈవో, తిరుపతి



తండ్రి హరికృష్ణ చిత్రం ఎదుట అద్దం పెడితే జూనియర్ ఎన్టీఆర్ చిత్రం కనిపిస్తున్న దృశ్యం

అద్దం ఆర్టు అదిరేట్టు

సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర చిత్రం విడుదల సందర్భంగా గుడుపల్లెకు చెందిన కళాకారుడు పురుషోత్తం జూనియర్ ఎన్టీఆర్, అతని తండ్రి హరికృష్ణపై వేసిన మిర్రర్ ఆర్టు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. హరికృష్ణ చిత్రం ఎదుట అద్దం పెడితే ప్రతిబింబంలో జూనియర్ ఎన్టీఆర్ కనిపించడం విశేషం. ప్రస్తుతం ఈ చిత్రం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం



ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ ... రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలోని రెండు ప్రైవేటు ఆస్పత్రులను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ కౌన్సిల్ నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా స్థానిక రామలక్ష్మమ్మ అస్థిటిక్ కేంద్రం, సెలబ్రిటీ లుక్స్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రుల ధ్రువపత్రాలు, చికిత్సల వివరాలు పంపాలని సూచించారు. వైద్యులు శిరీష, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛతా హీ సేవ'

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త ప్రదీప్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 8.50 గంటలకు స్థానిక గంగినేని చెరువు వద్ద స్వచ్ఛతాహీ ప్రతిజ్ఞ ఉంటుందని, 8.55 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. 9.45కి మెసానికల్ మైదానం వద్ద ముగింపు సభ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

సినీ ఫక్కీలో దుండగుల పరారీ



ద్విచక్ర వాహనంపై పరారైన దుండగులు (సీసీ కెమెరా ఫుటేజీ)

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని సినీ ఫక్కీలో దుండగులు పరారైన ఘటన బైరెడ్డిపల్లె మండలం రామసముద్రంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో నారాయణస్వామి, అలివేలమ్మ కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు దుకాణం వద్ద ఆగి అలివేలమ్మను నీళ్ల సీసా అడిగారు. బాటిల్ అందిస్తుండగా ద్విచక్ర వాహనంలోని ఓ యువకుడు వచ్చి ఆమె మెడలోని బంగారు బొట్టు గొలుసును లాక్కుని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితురాలు గ్రామస్థులకు సమాచారం అందించి దుండగులను ద్విచక్ర వాహనంలో వెంబడించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గొలుసు విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. దుండగులు కర్ణాటక సరిహద్దు వైపు వెళ్లి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వరకట్నం కేసులో మూడేళ్ల జైలు



సూరిబాబు

పుత్తూరు, న్యూస్‌టుడే: వరకట్నం వేధింపులకు సంబంధించి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారని సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. నత్త గ్రామానికి చెందిన రామయ్య కుమారుడు సూరిబాబుకు.. దివ్యభారతిని ఇచ్చి వివాహం చేశారు. 2020లో తన భర్త వరకట్నం కోసం వేధిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి వివరాలు కోర్టుకు అందజేశామన్నారు. నేరం రుజువు కావడంతో జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ సూరిబాబుకు బుధవారం మూడేళ్ల జైలుశిక్ష, రూ. 5వేలు జరిమానా విధించారని సీఐ తెలిపారు. బాధితురాలి తరఫున ఏపీపీ మునీషబేగం వాదించారని చెప్పారు.

ఐదు గ్రానైట్ లారీలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరం మండలం సురేంద్రనగరంలో అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న ఐదు లారీలను స్వాధీనం చేసుకున్నామని సీఐ హనుమంతప్ప బుధవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం సురేంద్రనగరం సమీపంలో ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో పాటు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి దస్త్రాలు లేకుండా అధిక లోడ్‌తో వెళుతున్న ఐదు గ్రానైట్ లారీలు స్వాధీనం చేసుకున్నారన్నారు. వీటిని మైన్స్ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు

పుంగనూరు గ్రామీణ: బాలిక(17)కు మాయమాటలు చెప్పి అత్యాచారం చేసిన ఘటన పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మండలంలోని అక్కింవారిపల్లెకు చెందిన విజయభాస్కర్(39)పై సీఐ శ్రీనివాసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. విజయభాస్కర్ కూలీ పనులు చేసేవాడు. బాలికను నమ్మించి అత్యాచారం చేశాడు. ప్రస్తుతం బాలిక స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



జ్యోతీశ్వరరెడ్డి, గణేశన్, ఎర్ర చందనం దుంగలు

ఎర్రచందనం పట్టివేత

తిరుత్తణి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నుంచి చెన్నైకి మినీ లారీలో అక్రమంగా తరలిస్తున్న రూ. 50 లక్షల విలువ చేసే ఎర్ర చందనాన్ని తిరుత్తణి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం తిరుత్తణి సమీపంలోని తిరుపతి జాతీయ రహదారిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుత్తణికి వస్తున్న ఓ వ్యానులో తనిఖీ చేయగా సుమారు రెండు టన్నుల బరువున్న ఎర్ర చందనం ఉండటాన్ని గుర్తించారు. వాటిని తరలిస్తున్న చిత్తూరుకు చెందిన గణేశన్(45), జోతీశ్వర్‌రెడ్డి(44)లను అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

నేడు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

చిత్తూరు నగరం: నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల్ని తెలుసుకోవడానికి ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నరసింహ ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో.. 98499 07885 నంబరుకు ప్రజలు ఫోన్ చేసి సమస్యల్ని తెలియజేయాలని సూచించారు.

ఉద్యోగోన్నతి కల్పించాలి

చిత్తూరు విద్య: డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితులకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఉన్నతాధికారులకు విన్నవించామని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పార్వతి, ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డిని బుధవారం ఆయన వేర్వేరుగా కలిసి సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు. రాజేష్, పురుషోత్తం, సతీష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పుత్తూరు: పట్టణంలోని సబ్‌స్టేషన్ల నిర్వహణ కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంట వరకు విద్యుత్తు కోత విధిస్తున్నట్లు ఏడీఈ శంకరయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక ఇరువారం పీహెచ్ కాలనీలోని డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. -స్థానికులు

సమాధానం: డ్రైనేజీ కాలువలో పూడికతీత పనులు చేపడతాం. **-అనిల్ కుమార్, నగరపాలక ఆరోగ్యాధికారి**

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

సమస్య: ఎగవూరు సత్యమ్మకాలనీ ప్రధానవీధిలో మురుగుకాల్వ పాడైపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచింది. దీంతోపాటు ఈ మార్గంలో వచ్చే వాహనాలు పాడైన కాలువలో పడి పెనుప్రమాదానికి గురయ్యే అవకాశముంది. **-రాజేష్, స్థానికులు**

సమాధానం: పంచాయతీ నిధులతో పాడైన మురుగు కాల్వ బాగుచేయిస్తాం.
-ఉదయ్, పంచాయతీ కార్యదర్శి, జీడీనెల్లూరు

మౌలిక వసతుల కల్పనకు కృషి: కలెక్టర్


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పెనుమూరు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో కొన్ని పరికరాలు అవసరమని వైద్యులు సూచించగా వాటి కొనుగోలుకు వెంటనే రూ.1.60 లక్షలు మంజూరు చేశారు. ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. పనులు నిలిచిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలించి పూర్తిచేయిస్తామన్నారు. ఆపై కలెక్టర్‌ను తెదేపా మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు కలిసి సత్కరించారు. కలెక్టర్ పర్యటన అనంతరం డీసీహెచ్ఎస్ ప్రభావతి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యులు గీతాకుమారి, సంధ్య, శ్రీధర్‌బాబు, తెదేపా జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, మాజీ సర్పంచి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. **చిత్తూరు గ్రామీణ:** నూతన ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని రెవెన్యూ అధికారుల్ని కలెక్టరు సుమిత్‌కుమార్ ఆదేశించారు. దిగువమాసాపల్లె ఇసుక స్టాక్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.. జేసీ విద్యాధారి, ఆర్డీవో చిన్నయ్య, గనుల శాఖ డీడీ ప్రసాద్ పాల్గొన్నారు. ● ఎన్‌హెచ్ అధికారులు దిగువమాసాపల్లె చెరువు నుంచి నీరు బయటకు వెళ్లే వంక మార్గంలో గోడ నిర్మాణాల్ని తొలగించాలని ఎమ్మెల్యే జగన్మోహన్.. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దిగువమాసాపల్లె రైతులు, ప్రజల అభ్యర్థనల్ని కలెక్టర్, ఎమ్మెల్యే జగన్మోహన్ ఆ మార్గాన్ని పరిశీలించారు. స్పందించిన కలెక్టర్ గోడ నిర్మాణాల్ని తొలగించాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. తెదేపా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, ఎన్‌హెచ్ అధికారులు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీధులకు దారేది.. అభివృద్ధి జాడేది..?

◆ శివారు ప్రాంతాల్లో వసతుల కరవు
◆ ఏళ్లుగా వెంటాడుతున్న సమస్యలు


తేనెబండ ప్రారంభంలో నీవానదిలో మురుగు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

చిత్తూరు నగరంలోని పలు కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి.. నగరంలో ఓ భాగమైన ఈ డివిజన్‌లో ఏళ్ల తరబడి మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. ఎంతో మంది కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించినా.. సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.. నగరపాలక డివిజన్‌గా ఏర్పాటైన తరవాత ఇద్దరు కార్పొరేటర్లుగా ఎన్నికైనా డివిజన్ అభివృద్ధిని మరిచారు.. నగరం నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతం సదుపాయాల లేమితో పల్లె వాతావరణాన్ని తలపిస్తోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు డివిజన్ పరిధిలోని కాలనీల్లో పర్యటించారు.. ప్రజలు సైతం స్థానిక సమస్యల్ని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వినతుల రూపంలో తీసుకొచ్చారు.. ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి పనులు ఇక్కడ చేపట్టకపోవడం గమనార్హం.

సమస్యల తిష్ట..

22వ డివిజన్ ప్రారంభంలోని తేనెబండ ప్రాంతం అభివృద్ధి చెందినా తరవాత వచ్చే శ్రీనివాసపురం, గంగాకాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ కాలనీ ప్రారంభమే సమస్యలతో స్వాగతం పలుకుతోంది. గుట్టపైన ఉన్న ఈ కాలనీల్లో రహదారి సదుపాయం లేకపోవడంతో ఎగుడుదిగుడుగా ఉన్న మట్టిరోడ్లు, రాతి బండలపై వాహనాల ప్రయాణం దుర్భేద్యమైంది. వీధిదీపాలు ఉన్నా సక్రమంగా వెలగని కారణంగా ఇళ్ల చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో రాత్రివేళల్లో విషపురుగుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో నివాసాల ఎదుట చిన్నపాటి గుంతల్లో మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువగా ఉంటోందని కాలనీ వాసులు చెబుతున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మహిళలు తెలిపారు. అదేవిధంగా వర్షాకాలంలో కాలనీలో పారిశుద్ధ్యం లోపం కారణంగా పిల్లలకు మలేరియా, గన్యా, డెంగీ తదితర విషజ్వరాలు వస్తున్నాయని, ఈ కాలనీకి పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధులకు రావడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక్కడ రాత్రివేళ మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని, ఇటువైపు రావాలంటేనే మహిళలు వెనుకంజ వేస్తున్నారు. కాలనీలో సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కాలువలు నిర్మించాలి..

మా కాలనీలో మురుగుకాలువలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నివాసాల ఎదుటే మురుగు నీరు గుంతల్లో నిల్వ ఉంటోంది. వీటి నుంచి దోమలు, దుర్వాసన ఎక్కువగా ఉంటోంది. పలుమార్లు సమస్యల్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా స్పందించాలి.
– విజయ్, స్థానికుడు

దృష్టి సారిస్తాం..

ఆయా కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు గుర్తిస్తాం. డ్రైనేజీ కాలువలు, రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.
– వెంకట ప్రసాద్, డీఈఈ, నగరపాలక సంస్థ


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో దేవరాజు

పదిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

పూతలపట్టు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో దేవరాజు ఉపాధ్యాయులను ఆదేశించారు. పి.కొత్తకోట జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో దేవరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు గోపి పాల్గొన్నారు.


దీక్షలో జనసేన నాయకులు

కొనసాగిన జనసేన దీక్ష

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పార్టీ శ్రేణులు చేపట్టిన దీక్ష బుధవారం కొనసాగింది. స్థానిక గంగినేని విగ్రహ కూడలి వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నాయకులు దయారాం, ఇతర నాయకులు పాల్గొన్నారు. భాజపా నాయకులు మద్దతు తెలిపారు.

ఆగమోక్తం.. అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేకోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన కల్పవృక్ష వాహన సేవ సందర్భంగా కల్యాణ వేదిక వద్ద స్వామివారి అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం ఆగమోక్తంగా నిర్వహించారు. క్షీరకలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామి వారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు, ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఊరేగింపులో ఏర్పాటు చేసిన తప్పెటగూళ్లు, విచిత్ర వేషధారణలు, భేతాళ నృత్య ప్రదర్శలు, కోటాలాలు, చెక్కల భజనలు భక్తులు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఈవో పి.గురుప్రసాద్, మాజీ ఛైర్మన్ మణినాయుడు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకోత్సవాల్లో 'ఈనాడు'

పగలు: అభిషేకం
రాత్రి: పూలంగిసేవ
ఉభయదారులు: రాజ మాణిక్యంనాయుడు వారి కుమారులు, వేలూరు. కె. రాధాకృష్ణన్, కాణిపాకం.
ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ఆస్థాన మండపంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగును.
-న్యూస్‌టుడే, కాణిపాకం


సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకుడు


భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఈవో గురుప్రసాద్


ఊరేగింపులో ఉభయదారులు

సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి పెద్దపీట వేస్తున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కేబీఆర్ పురంలో బుధవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వినతి మేరకు పుత్తూరు మండలంలో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధుల రూ.30కోట్లు మంజూరు చేశారన్నారు. కేబీఆర్‌పురంలో అర్బిజన్ మిషన్ ద్వారా 60 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించాలని కోరారని, ఇందుకు రూ.30 లక్షలు మంజూరు చేస్తామని, జగన్నాథపురం, దేవసేనపురం రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ వందరోజుల పాలనలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. సర్పంచి జానకి, వైస్ ఎంపీపీ విమలమ్మ, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, ఎంపీడీవో జయరామయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల తెదేపా మాజీ అధ్యక్షుడు మోహన్‌రాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు కరుణ, మగేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పరిశుభ్రతతో ఆరోగ్యం: కమిషనర్.. చిత్తూరు నగరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. చర్చి వీధిలోని కూరగాయలు, చేపల మార్కెట్ ప్రాంగణాల్లో బుధవారం పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించారు. చీపురుపటి మార్కెట్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. వ్యాపారులతో మాట్లాడారు. ఆరోగ్యాధికారి అనిల్ కుమార్, పారిశుద్ధ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి.. కార్వేటినగరం: సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని డీసీహెచ్ఎస్ ప్రభావతి అన్నారు. స్థానిక సీహెచ్‌సీని బుధవారం ఆమె తనిఖీ చేశారు. వైద్యులు గోపీనాథ్, యూసఫ్, శృతి, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు అందజేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి

కరువు భత్యం ప్రకటించండి

పలమనేరు, న్యూస్‌టుడే: 2024 జనవరి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన కరువు భత్యాన్ని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యల గుర్తింపు, సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. 12వ పీఆర్‌సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతి ఆలస్యం కాకుండా కమిషనర్‌ను నియమించి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, పెండింగ్ పీఎఫ్ రుణాలు వెంటనే మంజూరు చేయాలని, జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్ నాయుడు, కోదండయ్య, మండల అధ్యక్షులు కుమార్, ప్రకాష్, ఆనందయ్య, రఘు, వెంకటేశులు, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, మురుగన్, మీనాక్షి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాఠశాల క్రీడల ఎంపికల్లో ప్రతిభ

నగరి: పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో నగరి మండలం ముడిపల్లి విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. అండర్-17 విభాగంలో యోగేష్, రూపశేఖర, ఆనంతరాజ్, అండర్-17 బాలికల విభాగంలో అపాలీ, నవ్యశ్రీ, నందిని, అండర్-14 విభాగంలో సిద్ధిక్, దీప ఉన్నారు. వీరిని చెస్ కోచ్ పీఈటీ ఆనంద్‌మోహన్, పీఈటీ మునికుమార్ అభినందించారు.


ర్యాలీగా వెళ్తున్న ఫార్మసీ కళాశాల విద్యార్థులు

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం

చిత్తూరు(వైద్యవిభాగం): నగరంలో బుధవారం వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ జ్యోతీశ్వరి, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, కళాశాల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **భగవద్గీత, జీకే పుస్తకాల వితరణ.. చిత్తూరు(సంతపేట):** జనసంఘ్ వ్యవస్థాపకుడు దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చిత్తూరు నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం.. గంగినేని విగ్రహ కూడలి వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భగవద్గీత, జనరల్ నాలెడ్జి పుస్తకాల్ని పంపిణీ చేశారు. మాజీ ఎంపీ దుర్గ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామభద్ర, మోహన్, గోకుల్ పాల్గొన్నారు.

◆ **భానుప్రకాష్‌ను కలిసిన తితిదే ఉద్యోగులు.. పుత్తూరు:** తితిదే ఉద్యోగ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను తిరుపతి నివాసంలో కలిశారు. ఇళ్ల స్థలాల విషయమై చర్చించారు. తనవంతు సహకారిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వెంకటేష్, నాగార్జున, రత్న ప్రభాకర్, ప్రసాద్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

◆ **పాత ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు.. చిత్తూరు గ్రామీణ:** చిత్తూరు పాత ఆర్డీవో కార్యాలయంలో గ్రామీణ తహసీల్దారు కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. పాత ఆర్డీవో కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే జగన్మోహన్, పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ పరిశీలించారు. అక్టోబరు తొలి వారంలో ఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. శశిరేఖ, కాండ్ర రమేష్ పాల్గొన్నారు.

◆ **ఆధునిక వ్యవసాయ పద్ధతులు చేపట్టాలి.. జీడీనెల్లూరు:** సాగులో కూలీలు, ఖర్చు తగ్గించుకోవాలంటే ఆధునిక వ్యవసాయ పద్ధతులు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. బుధవారం ఆయన పెద్దకాల్వలో జిల్లా వ్యవసాయ ప్రదర్శనశాల ప్రభాకర్‌తో కలిసి పొలం పిలుపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

◆ **దీనదయాళ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.. కార్వేటినగరం, పుత్తూరు, పెనుమూరు:** దీనదయాళ్ ఉపాధ్యాయను ఆదర్శంగా తీసుకోవాలని భాజపా మండల అధ్యక్షులు రాజశేఖర్, వాసుదేవనాయుడు అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం నిర్వహించారు. కుమార్‌రాజు, రామ్మూర్తిరెడ్డి, గురుమూర్తి, వేమారెడ్డి పాల్గొన్నారు. ● జిల్లా కార్యదర్శి బాబు.. పుత్తూరులో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి: ఎస్పీ

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు తూర్పు విభాగం పోలీసు స్టేషన్‌ను బుధవారం జిల్లా ఎస్పీ మణికంఠ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూర్పు విభాగం సర్కిల్ కార్యాలయంతో పాటు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి అధికారులు, సిబ్బంది పనితీరు, కేసు దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైం రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆపై స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసులతో పాటు పెండింగ్ కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు విభాగం పోలీసు స్టేషన్ సీఐ శ్రీనివాసులు, ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జీవితంలో విద్య కీలకం

చిత్తూరు విద్య: విద్య జీవితంలో అత్యంత కీలక అంశమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే బుధవారం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కష్టపడితే విజయాలు విద్యార్థుల సొంతమవుతాయని తెలిపారు. ప్రిన్సిపల్ జీవనజ్యోతి, సీపీడీసీ కార్యదర్శి రామకృష్ణ, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుడు చంద్రశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం


వెదురుకుప్పం: మాట్లాడుతున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

వెదురుకుప్పం: అభివృద్ధి, సంక్షేమంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బుధవారం తిరుమలయ్యపల్లెలో మండలాభివృద్ధి అధికారి హరిప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎంపీ లబ్ధిదారుల ఇంటికి స్టిక్కరు అంటించి కరపత్రాన్ని అందజేశారు. పలువురు నేతలు మాట్లాడుతూ వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లా పరిధిలోకి చేర్చాలని, రైతులకు తిరుపతి రైతు బజారులో పంటలను విక్రయించుకోడానికి అవకాశం కల్పించాలని కోరారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ కలెక్టర్లతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. **చిత్తూరు నగరం:** చిత్తూరు నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. కణ్ణన్ ప్రభుత్వ కళాశాల ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను మెరుగు పరచడానికి.. బెంగళూరు నగరానికి చెందిన వ్యాపార సంస్థలను ఆహ్వానిస్తున్నామన్నారు. మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత, కార్పొరేటర్లు పాల్గొన్నారు. **గుడిపాల:** వంద రోజుల ప్రగతి కరపత్రాలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అందజేశారు. జీజేయం ట్రస్టు అధ్యక్షుడు చెన్నకేశవులు నాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు పాల్గొన్నారు. **తవణంపల్లె:** ఇది ప్రజల సంక్షేమం కోరే మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లో అమలు చేసిన పథకాల గురించి వివరించారు. తహసీల్దారు సుధాకర్, ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, సీడీపీవో నిర్మల, ఎంఈవోలు హేమలత, త్యాగరాజరెడ్డి, తెదేపా మండలాధ్యక్షుడు దిలీప్‌నాయుడు, భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు వెంకటేశ్వరచౌదరి, భాస్కర్‌నాయుడు, అమరేంద్రనాయుడు, సునీల్‌కుమార్‌చౌదరి, కుమార్‌నాయుడు, గోపి, జయప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు. **విజయపురం:** పన్నూరు, పన్నూరు దళితవాడ, బూచివానత్తం, ఎల్లసముద్రం, మాదావరం, ఆమగుంట, ఓరూరు, ఆలపాకం తదితర పంచాయతీలలో తెదేపా నేతలు, అధికారులు కార్యక్రమం నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్


చిత్తూరు నగరం: ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

కొత్తగొల్లపల్లిలో అతిసారం

తవణంపల్లె: కొత్తగొల్లపల్లిలో అతిసారం సోకినట్లు మండల వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. గ్రామంలో 12 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో ప్రాథమిక పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించామని, ఇద్దరు చిత్తూరు ప్రభుత్వాసుపత్రి, ఇద్దరు చీలాపల్లి వద్ద ఉన్న సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. డీపీవో లక్ష్మి, డీఎంహెచ్‌వో ప్రభావతి, ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, గ్రామంలో పర్యటించారు.

యువకుడికి రిమాండ్

వెదురుకుప్పం: మారేపల్లె ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు పవన్‌కుమార్ మంగళవారం చవటగుంటలో ద్విచక్ర వాహనాన్ని దూకుడుగా నడుపుతూ ప్రజలను బెంబేలెత్తిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా అతడికి 15 రోజులు రిమాండ్ విధించారన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు



పంట వివరాలు తెలుసుకుంటున్న మధ్యప్రదేశ్ బృందం

ప్రకృతి వ్యవసాయంపై పరిశీలన

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురానికి చెందిన రామిశెట్టి మహేష్‌కుమార్ ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న పంటలను మధ్యప్రదేశ్‌కు చెందిన పరిశీలకులు బుధవారం పరిశీలించారు. సాగు పద్ధతులను తెలుసుకున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

కుప్పం పట్టణం: పురపాలిక కార్మికులకు లయన్స్ క్లబ్, బీఆర్‌డీ ఆస్పత్రి, పీఈఎస్ ఆస్పత్రి, శాంతి దంత ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం స్థానిక పురపాలిక కార్యాలయంలో నిర్వహించారు. 140 మంది పుర కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పురపాలిక పరిధిలోని అమరావతి కాలనీలో విద్యుత్తు స్తంభాలు లేకపోవడంతో కర్రలపై విద్యుత్తు తీగలను తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా అమరావతి కాలనీలో నెలకొన్న సమస్యలపై అధికారులు పట్టించుకోవడం లేదు. **- ప్రమోద్, స్థానికుడు**

సమాధానం: విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- సోమశేఖర్, ఎండీ, కుప్పం రెస్కో**

సమస్య: పురపాలిక పరిధిలోని మోడల్ కాలనీలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి విషసర్పాలకు ఆవాసాలుగా మారుతోంది. **- పవన్, కుప్పం**

సమాధానం: కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టేలా సిబ్బందిని ఆదేశిస్తాం. **- నాగేశ్వరరావు, కమిషనర్, కుప్పం పురపాలిక**



కల్లూరు: గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతులు, అధికారులు

పొలం పిలుస్తోంది

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లె, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీ గేటుకాడపల్లెలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి హేమలత, రైతు సేవా కేంద్రం సహాయకులు తేజ, లీలావరప్రసాద్, గణేష్ పాల్గొన్నారు. **పలమనేరు:** మండలంలోని పెంగరగుంట, సముద్రపల్లె గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు చేపట్టారు. కార్యక్రమంలో పెంగరగుంట సర్పంచి భువనేశ్వరి, రైతులు తిరుమలేశు, నాగరాజరెడ్డి, బాలాజీనాయుడు పాల్గొన్నారు. **సదుం:** గ్రామ రైతు సేవా కేంద్రాల్లో సమావేశం చేపట్టి పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఏడీ శివకుమార్ అన్నారు. చింతలవారిపల్లె, ఊటుపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో రైతులకు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు వివరించారు. **శాంతిపురం:** సేంద్రియ విధానం వల్ల భూసారాన్ని సంరక్షించుకోవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీ కారిణి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. ఎంకేపురం వద్ద రైతులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. మండల వ్యవసాయాధికారి అజ్మీర్, మాజీ సర్పంచి మునిరెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు. **సోమల:** ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్వశిక్షాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏవో సుధాకర్ కుమార్ తెలిపారు. మండలంలో బుధవారం పల్లిగట్టు, కామిరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

భావితరాలకు వసతి తిప్పలు

* సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు * పెండింగ్‌లో తొమ్మిది నెలల బిల్లులు

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం సంక్షేమశాఖ వసతి గృహాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. ప్రతినెలా విడుదల చేయాల్సిన నిధులు ఆపేసింది. దీంతో నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. అధికారులు తమ సొంత నిధులతో కొంత, అప్పులు చేసి మరికొంత నిర్వహణ బాధ్యతను చేపడుతున్నారు.

నిధులు రాని ఎస్సీ హాస్టళ్ల వివరాలు

గ్రామం	హాస్టళ్ల సంఖ్య
పలమనేరు	5
పెద్దపంజాణి రాయలపేట	1
కొలమాసనపల్లె	1
బైరెడ్డిపల్లె	1
వి.కోట	1





ఎస్సీ హాస్టల్‌లో మరమ్మతులకు గురైన ఫ్యాన్లు

అప్పులు చేసి నిర్వహించాల్సిన దుస్థితి..

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలకు ప్రతినెలా నిధులు విడుదల చేస్తే సక్రమంగా ఎలాంటి లోపాలు లేకుండా భోజనాలు ఏర్పాటు చేయడానికి వీలుంటుంది. ఒక విద్యార్థికి నెలకు రూ.1400 విడుదల చేయాల్సి ఉంది. ఉదా: పలమనేరు పట్టణంలోని ఎస్సీ-1, ఎస్సీ-2 హాస్టళ్లలో కలిపి మొత్తం 83 మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పాలు, కూర, అరటిపళ్లు, చికెన్, కోడిగుడ్లు కొనుగోలు చేస్తారు. ఒక హాస్టల్‌కు నెలకు 6 గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇలా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే వసతి గృహాలు నడుస్తుంటాయి. అయితే నిధులు రాకపోవడంతో అప్పులు చేసి నడపాల్సి వస్తోందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

గత ప్రభుత్వం 2023 డిసెంబరు నుంచి నిధులు విడుదల చేయలేదు. 9 నెలల నుంచి నిధులు రాకపోవడంతో అధికారులు నానా తంటాలు పడుతున్నారు. పలమనేరు నియోజకవర్గ పరిధిలోని మొత్తం 14 హాస్టళ్లకు ఇప్పటి వరకు రూ.2.5 లక్షల వరకు అప్పులు చేసి అధికారులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఎస్సీ వసతి గృహంలో ఫ్యాన్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేసేవారు లేకపోవడంతో మూలన చేర్చారు. మరమ్మతులు చేపట్టాలని అడగాలంటే రూ.2 వేలు విడుదల కావాల్సి ఉన్నా ఆ నిధుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.



పలమనేరు ఎస్సీ వసతి గృహం

నిధులు రావాల్సి ఉంది

పెండింగ్‌లో ఉన్న నిధుల విషయమై ప్రభుత్వం పరిశీలిస్తోంది. త్వరలో బిల్లులు విడుదల చేసే అవకాశం ఉంది. **- హైమావతి, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి, పలమనేరు**

నది పరిశీలన

స్పందనకు వందనం

పలమనేరు, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాకు కేంద్రమైన కౌండిన్య నదిని క్యాటిల్ ఫారం వద్ద అధికారులు పరిశీలించారు. 'చెలరేగిపోతున్న ఇసుక స్మగ్లర్లు' శీర్షికతో బుధవారం 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఆర్డీవో మనోజ్‌రెడ్డి స్పందించారు. అక్రమ రవాణాపై సమగ్ర సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. పలమనేరు తహసీల్దారు ఇన్బనాథ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇసుక రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అన్నదానం

పుంగనూరు, న్యూస్‌టుడే: మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు శాంతి దూత అని మదద్ చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు అధ్యక్షుడు అలీ అహ్మద్ హుదవి అన్నారు. బుధవారం స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, కోశాధికారి సైఫుల్లా పాల్గొన్నారు.

అధికారులు తీరు మార్చుకోవాలి

రామకుప్పం, న్యూస్‌టుడే: వ్యవసాయ, ఉద్యాన అధికారులు తీరు మార్చుకోవాలని బందార్లపల్లి పంచాయతీ రైతులు తీవ్రంగా మండిపడ్డారు. మండలంలోని గిడ్డపల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల కోసం పథకాలు ప్రవేశపెడితే వాటి అమలులో ఉద్యాన, వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఖరీఫ్‌లో 75శాతం ఈ క్రాప్ నమోదు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు ఆనందరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి మునిరెడ్డి, మాజీ సర్పంచులు పెరుమాల్, సుబ్రమణి పాల్గొన్నారు.



పలమనేరు: ర్యాలీలో పాల్గొన్న సభ్యులు

తిరుమల పవిత్రత కాపాడాలి

పలమనేరు, న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూకు వాడే నెయ్యి కల్తీపై పట్టణంలోని హిందూ సంఘాలు కదం తొక్కాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సంఘ సభ్యులు, భక్తులు ర్యాలీ నిర్వహించారు. కల్తీకి ప్రాయశ్చిత్తంగా బుధవారం ఆలయంలో స్వామివారి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బజారువీధి, పెట్రోలు బంకు సర్కిల్, ఎంటీటీ రహదారి, జవిళివీధి మీదుగా గోవింద నామస్మరణతో ప్రదర్శన చేపట్టారు. కల్తీకి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకుడు సిద్ధయ్య, బీసీవైపీ నాయకుడు రామచంద్ర యాదవ్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుంగనూరు: శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీలకు పాల్పడిన వారిని శిక్షించే వరకు నిరసనలు ఆగవని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద తిరుమల లడ్డూ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డిల చిత్రపటాలకు పాలుపోసి నివాళి తెలిపారు. దహనం చేసిన వారికి పాలుపోయడం సంప్రదాయమన్నారు. వారిపై చర్యలు తీసుకోకపోతే దశదిన కర్మక్రియలు చేస్తామని హెచ్చరించారు. ● పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంలో వాస్తవాలను వెలికితీసి తిరుమల పవిత్రతను కాపాడాలని అఖిల భారతీయ గోరక్ష మహాసంఘ జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్ ప్రభుత్వాలు కోరారు. బుధవారం స్థానిక ఇందిరా కూడలిలో గోవింద నామస్మరణతో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మల్లికారాణి, కృష్ణమూర్తి, గంగరాజు, బాబు, రాజాజెట్టి, నరసింహులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు

ఆటల్లో రాణిస్తే ఉజ్వల భవిత

సదుం, న్యూస్‌టుడే: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎంఈవో దామోదర్ పేర్కొన్నారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, అంజనేయులు పాల్గొన్నారు.

అభివృద్ధి సాధించడమే లక్ష్యం


కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఆదర్శవంతమైన అభివృద్ధి సాధించడమే కూటమి లక్ష్యమని తెదేపా పురపాలిక క్లస్టర్ ఇన్‌ఛార్జి వీజీ ప్రతాప్‌కుమార్ అన్నారు. స్థానిక సుజ్ఞానంద ఆశ్రమంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు, తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు శ్యామ్‌సుందర్, మంజునాథ్, హర్ష, శ్రీధర్ పాల్గొన్నారు. **బైరెడ్డిపల్లె:** రాష్ట్రంలో సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తోందని తెదేపా వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రఘుచంద్రగుప్త అన్నారు. లక్కనపల్లెలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఏపీవో హరనాథ్, వీఆర్వో వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **కల్లూరు:** మండలంలోని అన్ని పంచాయతీల్లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **సదుం:** కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమని తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రేగళ్లు రోడ్డు, బలిజవీధి, నడిగడ్డ గ్రామాల్లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. **రామకుప్పం:** కూటమి ప్రభుత్వం ప్రజల క్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని కుప్పం నియోజకవర్గ తెదేపా ఎన్నికల పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. రామకుప్పంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, నాయకులు పాల్గొన్నారు. **శాంతిపురం:** గత ప్రభుత్వం కక్ష సాధింపుతో అర్హులకు తొలగించిన పింఛన్లను కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు పేర్కొన్నారు. సి.బండపల్లె, 64- పెద్దూరు, నడింపల్లె, తుమ్మిశి, అబకలదొడ్డి, చిన్నారిదొడ్డి పంచాయతీల్లో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో ఆయన ప్రసంగించారు. నేతలు విశ్వనాథనాయుడు, నాగరాజు, జీసీ గోవిందరాజులు, రమేష్, ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు. **పుంగనూరు:** వంద రోజుల పాలనపై కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బృహత్తర కార్యక్రమమని మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి, తెదేపా మాజీ కౌన్సిలరు దేశాది ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని ఏతూరులో 'ఇది మంచి ప్రభుత్వం' గోడపత్రాలు ఆవిష్కరించి ఇంటింటా పంపిణీ చేశారు.



కుప్పం పట్టణం: మాట్లాడుతున్న తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రతాప్‌కుమార్, పక్కన కమిషనర్ శ్రీనివాసరావు



పుంగనూరు: గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు



రామకుప్పం: కరపత్రాలు చూపుతున్న కూటమి నేతలు



శాంతిపురం: గ్రామసభలో శ్రీనివాసులు, నాయకులు, అధికారులు

సీబీఎస్ఈ విద్యార్థుల ప్రతిభ

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: 6వ అంతరాష్ట్ర కరాటే పోటీల్లో లింగాపురం మదర్‌థెరిసా సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి అవార్డులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, ప్రిన్సిపల్ డేవిడ్ తెలిపారు. కర్నూలులో ఆదివారం నిర్వహించిన అంతరాష్ట్ర కరాటే పోటీల్లో 66మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో పాఠశాల విద్యార్థులు 17 బంగారు పతకాలు, 20 రజత పతకాలు, 30 కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను మదర్‌థెరిసా విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. **పుంగనూరు, న్యూస్‌టుడే:** స్థానిక ఇంపల్స్ ఐఐటీ పాఠశాలకు చెందిన విద్యార్థులను ప్రిన్సిపల్ సంతోష్‌కుమార్ అభినందించారు. కర్నూలులో జరిగిన 6వ అంతరాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ధన్యసాయి, మోక్షశ్రీ, తనీష్ కుమార్‌రెడ్డిలను పాఠశాల ఆవరణలో బుధవారం సత్కరించారు. బంగారు, కాంస్య పతకాలు సాధించారన్నారు.



అవార్డులు సాధించిన సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీలకు నలుగురి ఎంపిక

సోమల, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పోటీలకు మండలంలోని నంజంపేటకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయరాలు కుసుమాంబ, పీఈటీ నూర్జహాన్ తెలిపారు. నియోజకవర్గస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో విద్యార్థులు నిఖిత, దీక్షిత, మంజునాథ, కార్తీక్ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికైయ్యారన్నారు. బుధవారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయరాలు కుసుమాంబ, ఉపాధ్యాయులు



క్రీడాకారులతో తెదేపా నాయకులు

చదువుతోపాటు క్రీడలు అవసరం

గంగవరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని పలమనేరు పట్టణ తెదేపా అధ్యక్షుడు బలరాంశెట్టి, ప్రధాన కార్యదర్శి గిరిబాబు పేర్కొన్నారు. మండలంలోని జీఎల్ఎస్ ఫారం ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ జనసేన అధ్యక్షుడు హరీష్, నాయకులు సుబ్రహ్మణ్యం, జగన్ పాల్గొన్నారు.

భవనాలు భయపెడుతున్నాయి..!

పర్యవేక్షణ, నిర్వహణ లోపం కారణంగా ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కూలేందుకు సిద్ధం అంటూ ప్రజలను భయపెడుతున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు సైతం చేస్తాం.. చూస్తాం అంటున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

పెచ్చు'మీరిన ప్రమాదం

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం దుస్థితికి చేరుకొంది. 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో రూపుకోల్పోయింది. మరమ్మతులు కొరవడి వర్షాలకు ఉరుస్తోంది. పైకప్పు, గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో నీటి నిల్వల వల్ల విద్యార్థినులకు తీవ్ర అసౌకర్యం ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పలు మార్లు అధికారులకు విన్నవించినా మరమ్మతులకు నోచుకోలేదని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**



కూలేందుకు సిద్ధం..!

పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి మధ్యలోని రక్షణ గోడ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఆస్పత్రికి సంబంధించిన గోడ ఏ క్షణంలో అయినా కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో వాలిన గోడకు ఇనుప సామగ్రిని అడ్డుగా పెట్టారు. ప్రహరీ కూలితే ఆర్అండ్‌బీకి చెందిన అదనపు అతిథి గృహం దెబ్బతినే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై వివరణ కోరగా కూలిన రక్షణ గోడ స్థానంలో కొత్తగా నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని.. త్వరలో పనులు చేపడుతామని ర.భ ఏఈ క్రిష్ణానాయక్ తెలిపారు. **- న్యూస్‌టుడే, కుప్పం**



చెకుముకి పరీక్షల నిర్వహణకు స్పందన

బైరెడ్డిపల్లె: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చెకుముకి పరీక్షకు 1300 మంది విద్యార్థులు హాజరైనట్లు జేవీవీ కన్వీనర్ శశికుమార్ తెలిపారు. మండలంలోని 13 పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని చెప్పారు. స్థానిక బాలుర జడ్పీ పాఠశాలలో అక్టోబరు 1న మండల స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. **పెద్దపంజాణి:** స్థానిక పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు చెకుముఖి పరీక్షలు నిర్వహించారు.



బైరెడ్డిపల్లె: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సర్వే నుంచి తప్పించాలి

కుప్పం పట్టణం: సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటి సర్వేలో ఏఎన్‌ఎంలను పాల్గొంటున్నారు. వారిని తప్పించాలని కడా పీడీ వికాస్‌మర్మత్‌కు ఏఎన్‌ఎం సంఘ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు.

దంపతులపై దాడి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని దోబీ కాలనీకి చెందిన మేస్త్రీ చంద్రశేఖర్, కనకమ్మ దంపతులపై దాడి చేసి ఘటన బుధవారం జరిగింది. బాధితుల వివరాల మేరకు.. దోబీ కాలనీకి చెందిన చంద్రశేఖర్ ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి ఉండగా పొరుగున ఉన్న పెయింటర్ రాధాకృష్ణకు చెందిన పశువులు ద్విచక్రవాహనాన్ని పడేశాయి. పశువులను కట్టేసుకోమని చెప్పడంతో కోపోద్రేకులైన రాధాకృష్ణ, పద్మమ్మ, సాయి, మహేష్‌లు... చంద్రశేఖర్ భార్య కనకమ్మలపై దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

సారా స్వాధీనం

సదుం, న్యూస్‌టుడే: మండలంలోని తాటిగుంటపాళెం అటవీ పరిసర ప్రాంతాల్లో ఇందిరానగర్ తాండాకు చెందిన తులసినాయక్ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్‌షావలి బుధవారం తెలిపారు.